

చవితి సంబరం

జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళా భక్తులు పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.



పంచమి తీర్థానికి సర్వం సిద్ధం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పంచమి తీర్థానికి సర్వం సిద్ధమైంది.- 08లో



పెద్ద శేషవాహనంపై శ్రీవారు

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారు పెద్ద శేష వాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. – తిరుమల

న్యూస్‌రీల్

పళ్లికొండేశ్వరుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జడ్జికి మెమెంటో అందిస్తున్న ఆలయ చైర్మన్

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి పళ్లి కొండేశ్వర స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరవింద్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, ఈఓ కే.రామచంద్రారెడ్డి, అర్చకులు స్వాగతం పలికి స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ ప్రదోష మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. పుత్తూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, సత్యవేడు జూనియర్ జడ్జి వీ.గోపాలకృష్ణా, ఊత్తుకోట్టై మున్సిబ్ కోర్టు జడ్జి సెందమిల్ సెల్వన్, పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఊత్తుకోట్టై డీఎస్పీ గణేష్‌కుమార్, సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, నాగలాపురం ఎస్‌ఐ ఓబయ్య పాల్గొన్నారు.

27 నుంచి కులగణన

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 27 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు కులగణన చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన తమ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వర్చువల్ పద్ధతిలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి, ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకోవడం కోసం కులగణన చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. జేసీ డీకే బాలాజీ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 21 వరకు జిల్లాలో నిర్వహించే అడుదాం – ఆంధ్రా క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

విశ్వంలో రేపు ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఆదివారం ఉదయం 9గంటలకు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి అవగాహన సదస్సును ఉచితంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ప్రస్తుతం 4, 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని, ఈ సదస్సులో ఆయా ప్రవేశ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించడంతో పాటు ఇతరత్రా సందేహాలను నివృత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ఊంజల్ సేవా మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి పాల్గొన్నారు.



శ్రీహరికోట సమీపంలోని రాయదొరువు సముద్ర ముఖద్వారం వద్ద ఇసుక మేటలు (ఫైల్)

పులికాట్ మురిసేలా..!

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పులికాట్ సరస్సును సంరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బంగాళాఖాతం నుంచి ఏర్పడిన ముఖద్వారాల వద్ద పూడిక తీయించేందుకు కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది. సాగరమాల ప్రాజెక్టు కింద రూ.129 కోట్ల అంచనాలతో పనులు చేసేందుకు సిద్ధమైంది. ఈ పనులు పూర్తయితే ఆరు మండలాల్లోని 50 వేల మంది మత్స్యకారులకు జీవనోపాధి దొరుకుతుంది. అంతేకాకుండా 152 రకాల విదేశీ వలస విహంగాలకు ఆహారం సమృద్ధిగా సమకూరుతుంది. పూడిక తీత పనులకు ఈనెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్ ప్రారంభించనున్న నేపథ్యంలో మత్స్యకారుల్లో ఆనందం తొణికిసలాడుతోంది.

సముద్ర ముఖద్వారాల వద్ద పూడిక తీతకు సన్నద్ధం

- సాగరమాల ప్రాజెక్టు ద్వారా రూ.129 కోట్లు మంజూరు
- 2,800 మీటర్ల డ్రెడ్జింగ్ పనులకు అనుమతి
- పనులు పూర్తయితే 50 వేల మంది మత్స్యకారులకు ఉపాధి
- 21న భూమిపూజ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సూళ్లూరుపేట: జీవవైవిధ్యాన్ని సంతరించుకున్న రెండో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు పులికాట్ సరస్సు. మంచినీళ్లు, ఉప్పునీళ్లు కలగలసి 45 శాతం సెలైనిటీ కలిగి ఉండడంతో ఇక్కడ మత్స్య సంపద సమృద్ధిగా దొరికేది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా సముద్రం నుంచి ఉప్పునీరు రావడం తగ్గిపోవడంతో సెలైనిటీ తగ్గిపోయి మత్స్య సంపద కూడా తగ్గుతూ వస్తోంది. గత పదేళ్లతో పోల్చుకుంటే సరస్సులో మత్స్యసంపద బాగా తగ్గింది. సంవత్సరానికి సుమారు 7 నుంచి 8 టన్నులు మత్స్య సంపద దొరికేది. నేడు ఏడాదికి ఒక్క టన్ను కూడా దొరకని పరిస్థితి దాపురించింది.

గతంలో ఓట్ల కోసం గాలం వేసి.. ఆపై గాలికొదిలేసి..

గతంలో టీడీపీ నాయకులు మత్స్యకారుల ఓట్లు కోసం గాలం వేశారు. సముద్రముఖద్వారాల వద్ద పూడిక తీయిస్తామని చెప్పి ఒక్క ఫైల్ కూడా ముందుకు కదిలించలేకపోయారు. 1994 నుంచి 2004 దాకా, ఆ తర్వాత 2014 నుంచి 2019 దాకా అధికారంలో ఉన్నపుడు అప్పటి కేంద్ర ప్రభుత్వంతో అంటకాగినా పులికాట్ సరస్సు అభివృద్ధిని గాలికొదిలేశారు. 2018లో ఫ్లెమింగో ఫెస్టివల్ సమయంలో అప్పటి పర్యాటకశాఖామంత్రి పులికాట్ సరస్సు పూడికతీత పనులకు రూ.48 కోట్లు మంజూరు చేసినట్లు చంద్రబాబునాయుడు చెప్పారని గాలిమాటలు చెప్పారు. ఆ తర్వాత 2019లో మళ్లీ మత్స్యకారుల ఓట్లకు గాలం వేసి బోల్తాపడ్డారు. చంద్రబాబునాయుడు చెప్పిన కల్లబొల్లిమాటలను పక్కనబెట్టి మూకుమ్మడిగా జగనన్నకు మద్దతు తెలిపారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులికాట్‌సరస్సు పూడిక తీత పనులను చేయించేందుకు సాగరమాల ప్రాజెక్టు కింద రూ.129 కోట్లు మంజూరు చేయించారు.

మత్స్యకారుల పెద్దన్న జగనన్న

మత్స్యకారుల విషయంలో ముఖ్యమంత్రి జగనన్న పెద్దన్నపాత్ర పోషించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరిగిన ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారులు పులికాట్ ముఖద్వారాల పూడిక తీత విషయాన్ని వివరించారు. ఇచ్చిన మాటప్రకారం పూడికతీత పనులను చేయించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి రూ.129 కోట్ల నిధులు రాబట్టారు. మత్స్యకారుల చిరకాల కోరికను నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. ముస్ముందు మత్స్యకారులకు జీవనోపాధి మాత్రమే కాకుండా దేశవిదేశాల నుంచి శీతాకాలంలో విచ్చేసే విదేశీ వలస విహంగాలకు కూడా ఆహారం దొరికేటట్టు చర్యలు చేపడుతున్నారు. సముద్ర ముఖద్వారాల వద్ద పూడిక తీస్తే పులికాట్ సరస్సు ఎల్లప్పుడూ జలంతో కళకళలాడుతూ ఈ ప్రాంత పక్షుల భూతల స్వర్గంగా విరాజిల్లే అవకాశం ఉంది. తద్వారా ఈ ప్రాంతం పర్యాటకపరంగా కూడా అభివృద్ధి చెందనుంది. వీటిన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పూడికతీత పనులను ప్రారంభించేందుకు భూమిపూజ చేయనున్నారు. 2,800 మీటర్ల డ్రెడ్జింగ్ పనులను చేసేందుకు ఆ కార్పొరేషన్ ముందుకు రావడంతో తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా ముఖద్వారాల వద్ద ఇసుక మేటలను ఎప్పటికప్పుడు తొలగించనున్నారు.



వేసవి వచ్చేసరికి పులికాట్ సరస్సు ఇలా (ఫైల్)

ఇదొక చరిత్ర



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో నాయుడుపేటలో నిర్వహించిన మత్స్యకారులు సదస్సులో వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సంక్షేమమే కాకుండా అభివృద్ధిని కూడా దృష్టిలో ఉంచుకుని సుమారు 50 వేల మంది మత్స్యకారులకు జీవనోపాధి, 152 రకాల విదేశీ వలస విహంగాలకు ఆహారం అందించేందుకు పులికాట్ సరస్సు అభివృద్ధికి నడుంబిగించారు. సాగరమాల ప్రాజెక్టు కింద రూ.129 కోట్లు మంజూరు చేయించి భూమిపూజ కార్యక్రమానికి విచ్చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పులికాట్ సరస్సు ముఖద్వారాలు పూడికతీయడం అంటే గడిచిన 50 ఏళ్లలో ఇదొక చరిత్ర.

– కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

చాలా సంతోషం



తమిళనాడు వైపు పల్‌వేరికాడ్ వద్ద ఉన్న సముద్ర ముఖద్వారానికి పూడిక తీసే తరహాలోనే ఇక్కడ కూడా పూడిక తీయడానికి సన్నద్ధమవుతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ పనులు పూర్తయితే సరస్సులో నిత్యం జలకళ ఉంటుంది. మా మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతుంది. తద్వారా అందరికీ ఉపాధి ఏర్పడి సరస్సుపై సరిహద్దు వివాదాలు కూడా సమసిపోతాయి. ముఖద్వారాల వద్ద పూడిక తీయించే పనులను ప్రారంభించేందుకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఆర్.శివాజీ, పులికాట్ జాలర్ల సంఘ నాయకులు

సీఎం జగన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- ఏర్పాట్లపై అధికారయంత్రాంగంతో మంత్రుల సమాలోచనలు

సూళ్లూరుపేట: మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న సూళ్లూరుపేట నియోజకవర్గానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని మంత్రులు కే.నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాట్లను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. తడ మండలం మాంబట్టులోని ఏపీఐఐసీలో సభాస్థలిని, అపాచీ ఫుట్‌వేర్ కంపెనీ ఆవరణంలో హెలీప్యాడ్‌ను ఎంపిక చేశారు. సెక్యూరిటీ జోన్‌పరంగా చూసుకుంటే ఇక్కడే అన్ని విధాలా బాగుందని అధికారులు నివేదించారు. అనంతరం సూళ్లూరుపేట పట్టణంలోని టీవీఆర్ఆర్ కల్యాణ మండపంలో అధికారయంత్రాంగంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం


ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి మాట్లాడుతూ నిరుపేదల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి జగనన్న పర్యటనను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర అటవీ, విద్యుత్, గనులు, భూగర్భశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో రూ.148 కోట్లతో పులికాట్ ముఖ్యద్వారాల పూడిక తీత పనులకు శంఖుస్థాపన, కాళంగి నదిపై నాలుగులేన్ల వంతెనకు రూ.35 కోట్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంఖుస్థాపన చేస్తారన్నారు. అలాగే ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా వారికి చేయూతినిచ్చేందుకు కూడా పలు రకాల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ముందుస్తుగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సభావేదిక వద్ద ఎగ్జిబిషన్, ముఖ్యమంత్రి గ్రూప్‌ఫొటో ఏర్పాటు, కళాజాతా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. పోలీస్‌శాఖ తరుపు నుంచి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీ మద్దిల గురుమూర్తి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీవోలు ఆర్.చంద్రముని, కిరణ్‌కుమార్, తహసీల్దార్ కన్నంబాక రవికుమార్, చెంగాళమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపీపీలు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కొళవి రఘు, పట్టణపార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

తడ: సూళ్లూరుపేటకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం మంత్రులు, అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. హెలీప్యాడ్, పార్కింగ్, సభాస్థలిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట డీసీసీబీ అధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాంబట్టు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రథోత్సవం



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సర్వాలంకార శోభితమైన రథంపై శ్రీపద్మావతి అమ్మవారు కొలువుదీరి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి అశ్వవాహన సేవకు భక్తులు పోటెత్తారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–3 సత్యనారాయణ, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

– తిరుచానూరు(చంద్రగిరి)

టీడీపీలో హైడ్రామా

- సత్యవేడు ఇన్‌చార్జ్ హెలెన్‌పై తమ్ముళ్ల అసంతృప్తి
- ఉద్యోగానికి రాజీనామా 'డ్రామా' అంటోన్న మరో వర్గం
- తమిళనాట ఉద్యోగం.. ఆంధ్రలో రాజకీయం అంటూ ప్రచారం
- సత్యవేడు టీడీపీలో బయట పడిన అంతర్గత కుమ్ములాటలు

సాక్షి, తిరుపతి: సత్యవేడు టీడీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఇన్‌చార్జ్ హెలెన్ తీరునచ్చని టీడీపీలోని మరోవర్గం ఆమె రాజీనామా 'డ్రామా' ఆడుతోందంటూ ఆధారాలతో బయటపెట్టారు. టీడీపీ కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారని చంద్రబాబుని నమ్మించి సత్యవేడు నుంచి పోటీచేసేందుకు హై డ్రామా ఆడారంటూ ఆ పార్టీలోని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలకు బలం చేకూరేలా హెలెన్ తమిళనాడులో ఉద్యోగం చేస్తూ.. ఏపీలో రాజకీయం చేస్తోందంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. టీడీపీ నేతల మధ్య వర్గపోరుతో సత్యవేడు రాజకీయం రంజుగా మారింది. సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె హెలెన్. హేమలత వారసురాలిగా హెలెన్‌ను తెరపైకి తెచ్చిన మాజీ ఎమ్మెల్యే సత్యవేడు ఇన్‌చార్జ్‌గా తన కుమార్తెను ప్రకటింపజేశారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని టీడీపీలోని మరో రెండు వర్గాలు మాజీ ఎమ్మెల్యే హేమలత, కుమార్తె హెలెన్ విషయాలను బయటపెట్టడం ప్రారంభించారు. సోషల్ మీడియా వేదికగా గతంలోనే హేమలతపై పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మాజీ ఎమ్మెల్యే కుమార్తె హెలెన్‌పైనా అదే స్థాయిలో ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుత టీడీపీ సత్యవేడు ఇన్‌చార్జ్ డాక్టర్ హెలెన్ తమిళనాడులోని ఈఎస్‌ఐ హాస్పిటల్‌లో అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తూ, ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని సొంత పార్టీనేతలే విమర్శిస్తున్నారు. నాగలాపురం ఈస్ట్ దళితవాడకు చెందిన ఎ.సెల్వకుమార్ నమోదు చేసుకున్న ఆర్టీఐ యాక్ట్ ద్వారా డాక్టర్ హెలెన్ ప్రస్తుతం ఈఎస్‌ఐ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా బయటపెట్టారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద డాక్టర్ హెలెన్ తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు చెప్పారని, కానీ ప్రస్తుతం అక్కడా నేనే.. ఇక్కడా నేనే అనే విధంగా ఆమె వ్యవహార శైలి ఉందని ఆ పార్టీ శ్రేణులు పరోక్షంగా విమర్శిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ హోదాలో హుందాగా వ్యవహరించాల్సిన హెలెన్, అందుకు భిన్నంగా 'మీరు ఆ వర్గం, మీరు ఈ వర్గం' అంటూ పార్టీ కేడర్‌లో విబేధాలు సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా పార్టీకోసం జెండా మోస్తున్న నిజాయితీగల కేడర్ ను అయోమయానికి గురి చేస్తున్నట్లుగా పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హెలెన్ వైఖరి మెచ్చని నియోజకవర్గ ఏడు మండలాల్లోని పలువురు నేతలు ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న హెలెన్ ఉద్యోగ వివరాలు

ఆ ఇద్దరిపై హెలెన్ వర్గీయుల ఆగ్రహం

హెలెన్ అభ్యర్థిత్వాన్ని నచ్చని మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య, జేడీ రాజశేఖర్ వర్గీయులే వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ ఆమె వర్గీయులు మండిపడుతున్నారు. 2019లో జేడీని అభ్యర్థిగా ప్రకటించడంతో మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య కనిపించకుండా పోయారని ఆరోపిస్తున్నారు. పార్టీ నమ్మి టికెట్ ఇచ్చి గెలిపిస్తే.. ఎమ్మెల్యేగా ఉన్న ఆ ఐదేళ్లు పెద్ద ఎత్తున భూములు ఆక్రమించుకుని, వసూళ్లు చేసుకుని పత్తాలేకుండా వెళ్లిపోయారంటూ హెలెన్ వర్గీయులు మండిపడుతున్నారు. పార్టీ కి ఉపయోగపడని మాజీ ఎమ్మెల్యే తలారి ఇన్‌చార్జ్ హెలెన్‌కి టికెట్ రాకుండా అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. 2019లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన జేడీ రాజశేఖర్ నమ్మిన వారిని నట్టేట ముంచిన వ్యక్తి అని ఆరోపిస్తున్నారు. మండల నాయకుల వద్ద డబ్బులు ఖర్చుచేయించి పైసా ఇవ్వకుండా ఎగ్గొట్టిన జేడీఆర్ హెలెన్‌ని విమర్శించే అర్హత లేదని ధ్వజమెత్తుతున్నారు. సత్యవేడు టీడీపీలో గ్రూపులు ప్రోత్సహించింది జేడీఆర్ అని ఆమె వర్గీయులు మండిపడుతున్నారు.

పంచమి తీర్థానికి సర్వం సిద్ధం


చక్రస్నానానికి సిద్ధమైన పుష్కరిణి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థం (చక్రస్నానం) శనివారం ఉదయం 12.10 గంటలకు అత్యంత వైభవంగా జరగనుంది. లక్షలాది మంది భక్తులు పవిత్ర స్నానమాచరించేందుకు తిరుచానూరుకు తరలిరానున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లను టీటీడీ అధికారులు పూర్తిచేశారు. చక్రస్నానం కోసం పుష్కరిణిని సుమారు రూ.9 కోట్లతో ఆధునీకరించారు. చక్రస్నానం జరిగే ప్రాంతంలో పటిష్టంగా స్టీల్‌తో గ్రిల్స్‌ను ఏర్పాటుచేశారు. వీవీఐపీ, వీఐపీ, ఉద్యోగులకు ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటుచేశారు. చక్రస్నానం అనంతరం భక్తులకు తోళప్పగార్డెన్, జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం, అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో అన్నప్రసాదాలను పంపిణీ చేసేందుకు తాత్కాలిక జర్మన్ షెడ్లను ఏర్పాటు చేశారు. రద్దీని క్రమబద్ధీకరించేలా సింధు జంక్షన్ నుంచే గేట్లు ఏర్పాటు చేశారు. ప్రైవేటు బస్టాండు, ఘంటశాల విగ్రహం వద్ద ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. పుణ్యస్నానమాచరించేందుకు భక్తులు శుక్రవారం రాత్రే తిరుచానూరుకు చేరుకున్నారు. పుష్కరిణిలోకి ఉదయం 9గంటల తరువాత పాత పోలీస్‌స్టేషన్ మార్గంలో అనుమతించనున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

పంచమితీర్థానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్బన్ ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు ఏఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 55 మంది సీఐలు, 136 మంది ఎస్‌ఐలు, 203 మంది ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 753 మంది కానిస్టేబుళ్లు, 127 మంది మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డు 107, 230 స్పెషల్ పార్టీలతో గట్టి భద్రతను కల్పించారు. 170సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

రేపు పుష్పయాగం

శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు అమ్మవారికి పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు భక్తులు, దాతలు సమకూర్చిన దాదాపు నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహించనున్నారు.

నేడు అమ్మవారికి శ్రీవారి సారె

కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థ(చక్రస్నానం)నికి తన దేవేరి శ్రీపద్మావతి అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారి తరపున ముత్తైదువ సారె అందించడం అనాధిగా వస్తున్న ఆచారం. ఇందులో భాగంగా శనివారం వేకువజాము తిరుమలలో జీయ్యర్ స్వాముల సమక్షంలో పట్టుచీర, పసుపు, చందనం, కుంకుమ, బంగారు తిరువాభరణాలు, అన్నప్రసాదాలు తదితర ముత్తైదువ సారెతో శ్రీవారి ప్రతినిధిగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, ఏకాంగులు, అర్చకపరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి కోమలమ్మ సత్రం, కోదండరామాలయ, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్ద ఉన్న పసుపు మండపానికి తీసుకురానున్నారు. అక్కడ సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకురానున్నారు. అక్కడి నుంచి పంచమితీర్థం మండపానికి తీసుకువచ్చి, సారెను అమ్మవారికి సమర్పించనున్నారు.

పథకాలన్నీ ముంగిటకే



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నీ ప్రజల ముంగిటకే చేరుతున్నాయి. దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కారమవుతున్నాయి. పింఛను నుంచి ఆదాయపు పన్ను వరకు అన్నీ సమసిపోతున్నాయి. కష్టకాలంలో సీఎం జగనన్న దేవుడిలా ఆదుకుంటున్నారని ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

–సాక్షి, నెట్‌వర్క్

భూ సమస్య తీరింది



మా తండ్రి వెంకటయ్య మృతిచెంది 18 ఏళ్లు అయ్యింది. మా తండ్రి పేరుపైన 2.67 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మా తండ్రి పేరుపై ఉండతంతో ప్రభుత్వానికి సంబంధించి రైతుభరోసా, పీఎంకిసాన్ వంటి పథకాలు అందేవి కావు. మా తండ్రి పేరుపై ఉన్న పొలాన్ని నాపైన మార్చుకునేందుకు చాలా కాలంగా తిరిగాను. గత కొద్దిరోజుల క్రితం మోకాలు ఆపరేషన్ కారణంగా కార్యాలయాలకు తిరగలేకపోయాను. జగనన్న సురక్ష పథకం ద్వారా నేరుగా వలంటీరే మా ఇంటికి వచ్చి సమస్య తెలుసుకున్నాడు. నా తండ్రి పేరుపైన ఉన్న వ్యవసాయ భూమిని నాపేరుపై మార్చి సర్టిఫికెట్ మంజూరు చేయించారు. చాలా ఆనందంగా ఉంది.

- నట్టేరి నరసింహులు, ముద్దంపల్లి, వెంకటగిరి రూరల్ మండలం

రేషన్‌కార్డు వచ్చింది



మాది వరదయ్యపాళెం మండలం, ఇందిరానగర్ పంచాయతీ, పద్మావతీపురం గ్రామం. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లు రావడంతో రేషన్‌కార్డును గతంలో కోల్పోయాను. అయితే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్ మా ఇంటికి వచ్చిన సమస్య తెలుసుకున్నారు. వెంటనే జగనన్న సురక్షలో తిరిగి రేషన్‌కార్డు ఇప్పించారు. ఇప్పుడు నిత్యావసర సరుకులు తిరిగి పొందుతున్నాను. సంతోషంగా ఉంది.

-కే.సెల్వి, వరదయ్యపాళెం మండలం

మోకాళ్లనొప్పులు తగ్గాయి



మాది పెళ్లకూరు మండలం, తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ. గత కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడేవాడ్ని. అయితే ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రత్యేక వైద్య నిపుణులచేత వైద్య పరీక్షలు చేయించుకున్నా. వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేయించుకోవడంతో పాటు, సరైన వైద్యం అందింది. ఇప్పుడు మోకాళ్ల నొప్పులు పూర్తిగా నయమయ్యాయి. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఆసరా పథకంతో పాటు వలంటీర్ల వల్ల అనేక పనులు సులభంగా చేసుకోగలుగుతున్నాను.

వంకపూరి చెంగయ్య, తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ, పెళ్లకూరు మండలం

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



గతంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నెలలు తరబడి తిరిగాను. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకున్నాను. తర్వాత తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాను. అయినా సర్టిఫికెట్ రాలేదు. జగనన్న సురక్ష పథకం ద్వారా అధికారులే మా ఇంటి దగ్గరకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. ఒకే రోజులో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉచితంగానే ఇచ్చి ఆదుకున్నారు. ఈ పథకం ఎంతో మేలుచేకూర్చింది.


ఎర్రమ్మ, సైదాపురం

ఉపాధి పనులకు వెళ్లి..


మృతుడు వెంకటకృష్ణయ్య (ఫైల్)

చిట్టమూరు: ఉపాధి పనులకు వెళ్లిన కూలీ అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని తాడిమేడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. తాడిమేడు గ్రామానికి చెందిన ముక్కర వెంకటకృష్ణయ్య(56) శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లాడు. పనిచేసేందుకు ఉపక్రమిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కూలీలు అతన్ని కొత్తగుంటలోని ప్రయివేట్ వైద్యశాలకు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో నాయుడు పేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే వెంకటకృష్ణయ్య మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేశ్వరరావు

వెంకటగిరి రూరల్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు దంపతులను సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్ నగర్ ప్రాంతంలో అరవ రమణయ్య అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేసినట్టు తెలిపారు. అతని వద్ద 200 గ్రాముల ప్యాకెట్లు 25 గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే అతని ఇంటి వద్ద సోదాలు నిర్వహించగా 8 గ్రాముల ప్యాకెట్లు 50 (400 గ్రాములు) ఉన్నట్లు గుర్తించి రమణయ్య, అతని భార్య రమణమ్మను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కానిస్టేబుల్స్ పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ అద్భుతం

– కొనియాడిన కేంద్ర బృందం


తనపల్లి సచివాలయం వద్ద కేంద్ర బృందం

తిరుపతి రూరల్: రాష్ట్రంలో అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ అద్భుతమని, దీనివల్ల గ్రామీణులకు సత్వర సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తరుపున రాష్ట్రంలో పర్యటిస్తున్న యువ అధికారుల బృందం కొనియాడింది. క్షేత్ర స్థాయిలో గ్రామీణుల జీవన విధానం మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించేందుకు జాతీయ సహజవనరుల శాఖకు చెందిన శుభంజాన్‌గ్రా, జౌళి శాఖకు చెందిన హరీష్‌విహల్టి, ఇండస్ట్రీ, కామర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన యోగేష్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన దంబీర్‌యాదవ్, పెట్రోలియం శాఖకు చెందిన రాహుల్‌జైన్‌తో కూడిన ఐదుగురు యువ అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలంలోని పెరుమాళ్లపల్లిలోని గ్రామ సచివాలయం, ఎస్‌డబ్ల్యూపీయస్ సెంటర్, తనపల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయం, స్త్రీశక్తి భవన్‌లను సందర్శించారు. వాటి పనితీరు, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది విధులు, గ్రామీణులకు అందిస్తున్న సేవలు వంటి అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాలను సందర్శించారు. సచివాలయ వ్యవస్థ వల్ల గ్రామీణులకు అద్భుత ఫలితాలు అందుతున్నాయని కొనియాడారు. పల్లె ప్రజలు శుభ్రత–పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ భారత అభియాన్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని వై బ్రాండ్ గ్రామాలుగా తీర్చిదిద్దే యజ్ఞంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రబృందానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలపై కేంద్ర బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తిరుపతి డీఎల్‌పీఓ రూపరాణి, ఈఓపీఆర్డీ గిరిధర్ రెడ్డి, ఈవో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

భూకబ్జాదారుడు జయకృష్ణ యాదవ్


మాట్లాడుతున్న శ్రీకాళహస్తి వాసులు

తిరుపతి కల్చరల్: నిత్యం దౌర్జన్యాలు, భూకబ్జాలకు పాల్పడుతున్న జయకృష్ణ యాదవ్ రౌడీషీటర్‌గా అతనిపై అనేక కేసులు నమోదయ్యాయని, టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి అండతో భరితెగించి దౌర్జనాలకు పాల్పడుతున్నాడని శ్రీకాళహస్తికి చెందిన రాధా, బాబూరావు, మహ్మద్ ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మిట్టకండ్రిగ వద్ద తమ భూమికి దారి ఏర్పాటు చేసుకుంటుంటే అడ్డుకొని ఆ స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు జయకృష్ణ యాదవ్ ప్రయత్నిస్తున్నారన్నారు. మెయిన్ రోడ్డు పక్కన మూడన్నర ఎకరాల స్థలం ఉందని, తమ భూమి తర్వాత అతని భూమి ఉండడంతో తమ భూమి నుంచి అతని భూమికి దారి ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపారు. నిరంతరం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డికి సంబంధం లేకున్నా ఆయనపై నిందారోపణలు చేయడం దుర్మార్గమన్నారు. నేర చరిత్ర కలిగిన జయకృష్ణ యాదవ్ శ్రీకాళహస్తిలో టీడీపీ అండతో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెండేళ్ల క్రితం మహ్మద్‌కు చెందిన బేకరీలో స్వీట్లు ఉచితంగా ఇవ్వలేదని వారిపై దాడి చేయడంతో పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ఇతని ఆరాచకాలను సహించలేని యాదవ వర్గానికి చెందిన వారు సైతం యాదవ సంఘం నుంచి వెలివేశారని తెలిపారు. డీకేటీ భూమిని సైతం కబ్జా చేసి భవంతి కట్టుకొని అక్కడే కాపురం ఉంటున్నాడన్నారు. అక్రమాలు, దౌర్జన్యాల కారణంగా కేసులతో జైలుకెళ్తే ఎమ్మెల్యే తనను జైల్లో పెట్టించారని తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు.